క్లుప్తంగా

షాద్‌నగర్ డీఐగా వెంకటేశ్వర్లు



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ)గా సంద వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సైబరాబాద్ సీపీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న సంద వెంకటేశ్వర్లు షాద్‌నగర్ డీఐగా బదిలీపై ఇక్కడకు వచ్చిన విషయం విధితమే. ఇక్కడ డీఐగా పనిచేసిన పీడీ.నాయుడు మేడ్చల్ జోన్ సీసీఎస్ విభాగానికి బదిలీ అయ్యారు. పీడీ.నాయుడు స్థానంలో నూతన డీఐగా బాధ్యతను చేపట్టిన సంద వెంకటేశ్వర్లును ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయకమార్ అభినందించారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న యాదయ్య యాదవ్ కుటుంబసభ్యులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణానికి చెందిన అరటి యాదయ్యయాదవ్, అరటి విజయలక్ష్మి దంపతుల కుమారుడు అరటి ఆకాశ్‌యాదవ్ బుధవారం ఆలయాల అభివృద్ధికి విరాళం అందజేశారు. నందిగామ మండల పరిధిలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రహరీ నిర్మాణానికి రూ.1లక్ష 11వేలు, ఫరూఖ్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి రూ.25వేల విరాళాన్ని ఆలయాల కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కుమార్‌గౌడ్, కృష్ణయాదవ్, కృష్ణగౌడ్, నర్సింలుగౌడ్, నిరంజన్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, భవితేజ, గంధం ఆనంద్, పిల్లి శేఖర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంపై గొడ్డలి వేటు

అభివృద్ధి పేరిట చెట్ల నరికివేత



రోడ్డు పక్కన కలప

మంచాల: మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని ఓ వైపు ప్రభుత్వం ఏటా రూ.కోట్లు ఖర్చు పెడుతుండగా.. మరోవైపు అభివృద్ధి పేరిట కొందరు ఏపుగా పెరిగిన చెట్లను మొదళ్లకు నరికి వేస్తున్నారు. మంచాల మండలంలో రహదారుల నిర్మాణం, విద్యుత్ తీగలకు చెట్లు, కొమ్మలు అడ్డుగా ఉన్నాయంటూ సంబంధిత సిబ్బంది, కాంట్రాక్టర్లు వృక్షాలను నేల కూలుస్తున్నారు. ఇదే అదునుగా కొందరు కలపను విక్రయించి, సొమ్ముచేసుకుంటున్నట్లు సమాచారం. చెట్లను కూలదోయడమే కాకుండా.. వాటి స్థానంలో మరలా మొక్కలు నాటాలని ప్రజలు కోరుతున్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

తుర్కయంజాల్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కౌన్సిలర్ అనురాధ అన్నారు. బుధవారం ఆమె దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డును అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.

ట్రంక్‌లైన్ పనులు షురూ



ట్రంక్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ పనిచేస్తుందని కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య అన్నారు. బుధవారం ఆయన పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని 22వ వార్డు సాయి ప్రియనగర్‌లో రూ.కోటి అంచనా వ్యయంతో చేపడుతున్న మురుగునీటి ట్రంక్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ లైన్ నిర్మాణంతో సమస్యకు ముగింపు పలికినట్లేనని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ భిక్షపతి, నాయకులు మోహన్ నాయక్, రాగ్యా నాయక్, రాజు నాయక్, వెంకటేశ్ యాదవ్‌తో పాటు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సమగ్ర సర్వే ప్రారంభం

ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే బుధవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు సర్వేపై సమీక్షలు నిర్వహించారు. ఇళ్ల జాబితా, ఇంటింటికీ స్టిక్కర్లు, ప్రశ్నావళి తదితర అంశాలపై ఎన్యుమరేటర్లు, జీపీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. వారందరూ ఇంటింటికీ స్టిక్కర్లు అతికించే పనిలో నిమగ్నమయ్యారు.



షాద్‌నగర్‌రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ఇళ్ల జాబితాను సిద్ధం చేసే పనిలో అధికారులు
- ప్రతి ఇంటికీ స్టిక్కర్ల పంపిణీ
- పారదర్శకంగా చేట్టాలని సూచన

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర సర్వేతో అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులసర్వే(సమగ్ర ఇంటింటి సర్వే)ను ఆయన ప్రారంభించారు. ఫరూఖ్‌నగర్ పట్టణంలో, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన సమగ్ర సర్వేను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగారెడ్డిగూడ గ్రామంలో మహిళలు ఎమ్మెల్యేకు తిలకం దిద్ది మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లతో అగ్రకుల నాయకులే రాజ్యాధికారాన్ని చేపడుతున్నారన్నారు. రాష్ట్ర సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉద్యోగ, విద్యవంటి అంశాల్లో అసమానతలను రూపుమాపేందుకే సమగ్ర సర్వేను నిర్వహిస్తున్నారన్నారు. అగ్రవర్ణాలకు చెందిన సీఎం రేవంత్ రెడ్డి చిన్న కులాల కోసం సమగ్రసర్వేను చేపట్టేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. సమగ్ర సర్వేపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ప్రతి ఒక్కరూ సర్వేకు వచ్చిన అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డివిజన్ ప్రత్యేకాధికారి రామారావు, తహసీల్దార్ పార్థసారధి, డీఎల్‌పీఓ మల్లారెడ్డి, ఎంపీడీఓ బన్సీలాల్, ఎంపీఓ జయంత్‌రెడ్డి, ఎంఈఓ మనోహర్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్.నటరాజ్, కౌన్సిలర్లు విశాలవిశ్వం, శ్రావణి, శారద, కృష్ణవేణి, సర్వర్‌పాషా, శ్రీనివాస్, నాయకులు బాబర్‌అలీఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, చెన్నయ్య, బాల్‌రాజ్‌గౌడ్, ఎండీ.ఇబ్రహీం, రఘు, అశోక్ పాల్గొన్నారు.

పారదర్శకంగా నిర్వహించాలి

కొందుర్గు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని సర్వేను ప్రారంభించారు.సర్వేకు అందరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రమేశ్‌కుమార్, జగదీశ్వర్, ఎంపీడీఓలు అనురాధ, ప్రవీణ్‌కుమార్, ఎంపీఓలు లాలయ్య, హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజు,నాయకులు పాల్గొన్నారు.

కులగణనతోనే బీసీలకు న్యాయం

నందిగామ: కులగణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్‌లో బుధవారం ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కుటుంబ సర్వేను ప్రారంభించారు. కులగణనతో బీసీల సంఖ్య తెలిసిపోతుందని, దీంతో వారికి అన్ని రంగాల్లో న్యాయం జరుగుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు రవీందర్, కావలి కృష్ణ, మహేందర్, రాజునాయక్, తులసీరాంనాయక్, విజయ్ నాయక్, కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, రాజ్‌గోపాల్, తహసీల్దారు రాజేశ్వర్, ఎంపీడీఓ సుమతి, ఎంపీఓ తేజ్‌సింగ్, ఏపీఎం యాదగిరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోమాల్‌పల్లి గ్రామంలో..

కేశంపేట: కులగణనతోనే సామాజిక న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామంలో ఇంటింటి సమగ్ర సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సర్వేను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో అండర్‌డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మండల అధ్యక్షుడు గూడ వీరేశ్‌భాస్కర్‌గౌడ్, ఆనంద్‌కుమార్, అంజయ్య, కృష్ణయ్య, రావుల పెంటయ్య, మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా చేపట్టాలి



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లో సర్వేను ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి కిషన్‌రావు



కొత్తూరు: సర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య, అధికారులు

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే సక్రమంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి కిషన్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో సర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు ఇంటింటికి వెళ్లి కుటుంబ సర్వేలో అన్ని అంశాలను క్లుప్తంగా అడిగి తెలుసుకొని నమోదు చేస్తున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తప్పులు లేకుండా సమగ్రంగా సర్వే నిర్వహించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా మండల అధికారులతో సమాచారం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ ప్రత్యేక అధికారి అనురాధ, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందరూ సహకరించాలి

కొత్తూరు: మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఆధ్వర్యంలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆమెతో పాటు పలువురు సిబ్బంది వార్డుల్లో పర్యటించి సర్వేకు సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, సిబ్బంది, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను తనిఖీ చేసిన జిల్లా అధికారులు



చేవెళ్ల: ఈర్లపల్లిలో స్టిక్కర్లు వేసే కార్యక్రమాన్ని పరిశీస్లున్న డీపీఓ సురేశ్‌మోహన్



చేవెళ్ల: ఇంటింటి సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న మండల తహసీల్దార్ కృష్ణయ్య

చేవెళ్ల: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అధికారులు సర్వే టీమ్‌లకు వివరించారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నుంచి ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇంటింటికీ స్టిక్కర్లు అతికించే కార్యక్రమాలను జిల్లా అధికారులు సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేశ్‌మోహన్, జిల్లా ప్రణాళిక అధికారి సౌమ్య, మండల ప్రత్యేకాధికారి గోపికృష్ణలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మండలంలోని ఈర్లపల్లి, ఇబ్రహీంపల్లి, మల్కాపూర్, అల్లవాడ, తదితర గ్రామాల్లో వేరువేరుగా తనిఖీలు చేసి సర్వే సిబ్బందితో, గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. సర్వేకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కుటుంబాల గుర్తింపు కార్యక్రమం మూడురోజుల్లో అన్ని గ్రామాల్లో పూర్తికావాలన్నారు. ప్రతీ గ్రామంలో సర్వేను పక్కాగా నిర్వహించేలా చూడాలని ఎంపీడీఓ హిమబిందు, ఎంపీఓ విఠలేశ్వర్‌జీలకు సూచించారు. ఎప్పటికప్పుడూ సూపర్‌వైజర్లు గ్రామాల్లో సర్వే తీరును తనిఖీలు చేస్తుండాలని చెప్పారు. సర్వేకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధులపై సీఈఓ కృష్ణారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ హిమబిందు, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, సీనియర్ అసిస్టెంట్ రహీందర్‌లకు వివరించారు. మండల తహసీల్దార్ కృష్ణయ్య, చేవెళ్ల, కమ్మెట, ఈర్లపల్లి గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. అన్ని గ్రామాల్లో ఎన్యుమరేటర్లు, ఉపాధ్యాయులు ఈ ఇంటింటి సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వివరాలు సేకరించి స్టిక్కర్లు అతికించారు. మండలంలో మొదటి రోజు 146 బ్లాక్‌లలో ప్రారంభించి 7 బ్లాక్‌లు పూర్తిచేసి 10వేల ఇళ్లకు స్టిక్కర్లు అతికించినట్లు ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. కార్యక్రమాల్లో మండలంలోని సర్వే టీమ్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించుకోవాలి

ఇండియన్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి స్నేహజ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారి స్నేహజ

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని పట్టుదలతో సాధించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఇండియన్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి స్నేహజ పేర్కొన్నారు. మూడు రోజులుగా ఎన్‌టీఆర్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న స్పోర్ట్స్ మీట్ ఉత్సవాలు బుధవారం మూడోరోజు ముగిశాయి. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్నేహజ పాల్గొని బహుమతులు, షీల్డ్‌లను అందజేశారు. పోటీల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. మూడురోజుల పాటు జిల్లాస్థాయి స్పోర్ట్స్ నిర్వహించిన యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డీన్ రామారావు, డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జోజిరెడ్డి, శ్రీనివాస్, సినిమా యాక్టర్ విక్రమాదిత్య, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ పాఠశాలల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బ్యాగుల పంపిణీ



చిన్నారులకు బ్యాగులు అందజేస్తున్న సీఐ భూపాల్ శ్రీధర్, దాత రామకృష్ణ

చేవెళ్ల: అంగన్‌వాడీలోనే చిన్నారుల విద్యాభ్యాసానికి అడుగుపడుతుందని, ఇది వారికి ఇష్టంగా ఉండేలా అలవాటుచేయాలని సీఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలో గల అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు బుధవారం చేవెళ్లకు చెందిన దాత న్యాయవాది రామకృష్ణ బ్యాగులను అందించటంతో వాటిని సీఐ చేతుల మీదుగా చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో పిల్లలకు మంచి అలవాట్లు, క్రమశిక్షణ, ఆటపాటలతో చదువు నేర్పించాలని సూచించారు. బాల్యం ప్రతి ఒక్కరికి గొప్ప వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, జర్నలిస్ట్ రాఘవేందర్, నాయకుడు పొట్ట ప్రశాంత్, అంగన్‌వాడీటీచర్, పిల్లలు తదితరులు ఉన్నారు.

కష్టపడే వారికి ప్రత్యేక గుర్తింపు



వంద సభ్యత్వాలు చేసిన కార్యకర్తలను సన్మానిస్తున్న నాయకులు

బీజేపీ రాష్ట్ర నాయకుడు బాబయ్య

కొత్తూరు: పార్టీ బలోపేతం కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు అందె బాబయ్య అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో వంద సభ్యత్వాలు చేసిన వారిని ఆయనతో పాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి సభ్యత్వాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. నాయకులు, కార్యకర్తలు సాధ్యమైనన్ని సభ్యత్వాలు చేయించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇతర పార్టీల మాదిరిగా కాకుండా బీజేపీలో గ్రామ స్థాయి కార్యకర్తకు కూడా జాతీయస్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహాగౌడ్, మోహన్‌సింగ్, శ్రీనివాస్, మాణిక్యం, మహేందర్‌రెడ్డి, కుమార్, శ్రీశైలం, నర్సింహ, ఇంద్రసేనారెడ్డి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకా తప్పనిసరి



రెడ్డిపల్లిలో పశువులకు టీకా వేస్తున్న పశువైద్యులు

పశుసంవర్ధక శాఖ ఏడీ రవికుమార్

మొయినాబాద్: పాడిపశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయాలని పశుసంవర్ధక శాఖ ఏడీ రవికుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రెడ్డిపల్లిలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఇప్పటివరకు ఎన్ని పశువులకు టీకాలు వేశారు.. ఇంకా ఎన్ని పశువులకు టీకాలు వేయాల్సి ఉందనే విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు టీకాలు వేయడంలో అలసత్వం వహించొద్దన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని 185 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్, పశువైద్య సిబ్బంది పద్మ, ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా, గోపాలమిత్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో మాల్ గ్రామం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన 28 ఎల్‌ఈడీ వీధిలైట్లను బుధవారం గ్రామంలోని స్తంభాలకు బిగించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శేఖర్‌గౌడ్, జంగీర్, మురళి, బాల్‌రాజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రం ఏర్పాటే లక్ష్యం

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రం ఏర్పాటు చేసేంత వరకు పోరు ఆగదని, దీక్షలు విరమించేది లేదని జేఏసీ కన్వీనర్ మొక్కురాల అశోక్ గౌడ్ అన్నారు. మండలం ఏర్పాటు చేయాలంటూ గట్టుఇప్పలిపల్లిలో చేపట్టిన దీక్ష బుధవారానికి 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలం ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులు గ్రామంలో ఉన్నాయని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా మండల ఏర్పాటుకు ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ శరత్ చంద్ర, ఇస్లావత్ రాజు, రమేష్, రాములు, మల్లయ్య, జంగయ్య, శివ, రామిరెడ్డి, మాణిక్యం రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

కడ్తాల్: జిల్లా హమాలీ వర్కర్స్ ఫెడరేషన్, సీఐటీయూకి అనుబంధంగా.. హమాలీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వంపుగూడెం రమేష్, ప్రధాన కార్యదర్శిగా జిల్లెల పెంటయ్య, కోశాధికారిగా తుప్పరి వెంకటేశ్, సహాయ కార్యదర్శులుగా కేశని వెంకటేశ్, జంగయ్య, ఉపాధ్యక్షులుగా కాసమోని కృష్ణయ్య, పార్వతి జనార్దన్, పట్నం కృష్ణయ్య, జంగయ్య, సలహాదారులుగా రమేశ్, మల్లేశ్, పెంటయ్య, శ్రీను, కృష్ణయ్యలను నియమించారు. కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా కమిటీ కన్వీనర్ పెంటయ్య తదితరులు ఉన్నారు.

కేసీఆర్ పాలన అందరికీ ఆదర్శం

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అంజయ్య యాదవ్

కొందుర్గు: పదేళ్ల కాలంలో కేసీఆర్ చేసిన ప్రజా సంక్షేమపాలన అందరికీ ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, ఇది తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ అన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయభేరి మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధనతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలు యావత్ దేశాన్నే ఆకర్షితులను చేసిందన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజాసంక్షేమం కోసం పని చేసే పార్టీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ ప్రభుత్వాన్ని మరోసారి ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, నాయకులు బంగారు రాములు, బాబురావు, సత్యప్రమోద్‌రావు, రాములు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు



పశువుకు గర్భకోశ చికిత్స చేస్తున్న వైద్యులు

చేవెళ్ల: గ్రామాల్లో ప్రజలు, రైతులు వారి వద్ద ఉన్న పాడి పశువులు ఆరోగ్యంగా ఉంటేనే వాటి ద్వారా మంచి ఆదాయం పొందుతారని మండల పశువైద్యాధికారి శిరీష పేర్కొన్నారు. మండలంలోని జాలగూడ గ్రామంలో బుధవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ వైద్య శిబిరంలో పశువులకు నట్టల నివారణ మందులు, చూడి పరీక్షలు, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, గర్భకోశ వ్యాధి చికిత్సలు తదితర వైద్యపరీక్షలు చేశారు. ప్రజలు పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడూ ప్రభుత్వం ద్వారా అందించే వ్యాధి నిరోధక టీకాలను వేయించుకోవాలని సూచించారు. పాడి పశువుల ద్వారా ప్రజలకు, రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. పాడి రైతులకు పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గ్రామంలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.